ఇంటర్ సప్లిమెంటరీకి 279 మంది గైర్హాజరు

శ్రీకాకుళం : జిల్లాలో సోమవారం ప్రారంభమైన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 279 మంది గైర్హాజరరని ఆర్ఐఒ ప్రగడ దుర్గారావు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 202 మంది, ద్వితీయ ఇంటర్‌లో 77 మంది పరీక్షకు హాజరు కాలేదని అన్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు జనరల్ అభ్యర్థులు 3535 మంది దరఖాస్తు చేసుకోగా, 3355 మంది పరీక్షకు హాజరయ్యారని అన్నారు. వారిలో 180 మంది పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు. అలాగే ఒకేషనల్ సబ్జెక్టుకు 174 మందికి గాను, 152 మంది హాజరయ్యారని చెప్పారు. వారిలో 22 మంది హాజరు కాలేదని తెలిపారు. ద్వితీయ సంవత్సరానికి జనరల్ కేటగిరిలో 710 మందికి గాను, 640 మంది పరీక్షకు హాజరు కాగా, 70 మంది పరీక్ష రాలేదన్నారు. ఒకేషనల్ నుంచి 73 మందికి గాను, 66 మంది హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరయ్యారని వివరించారు.

ఉదయం ఎండ... సాయంత్రం వాన

- జిల్లాలో భిన్న వాతావరణం
- ఈదురుగాలులకు విరిగిపడిన చెట్లు
- అకాల వర్షానికి ఉప్పు పంటకు నష్టం
- పిడుగుపాటుకు వ్యక్తి, ఆవు మృతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం, నౌపడ, బూర్జ, సరుబుజ్జిలి

జిల్లాలో భిన్న వాతావరణం నెలకొంది. సోమవారం ఉదయం భానుడు నిప్పులు చెరగగా, సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, పిడుగులతో వరుణుడు వర్షించాడు. జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, శ్రీకాకుళం, పొందూరు, ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, సంతబొమ్మాళి తదితర మండలాల్లో వర్షం కురిసింది. మరికొన్ని మండలాల్లో మేఘావృతమై గాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. ఉక్కపోత, ఎండ వేడిమితో అల్లాడిన జనం వర్షం, చల్లని గాలులతో ఉపశమనం పొందారు. మరోవైపు ఈదురుగాలులతో అరటి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. పిడుగుపాటుకు సరుబుజ్జిలి మండలంలో గొర్రెల పెంపకందారుడు మృతి చెందగా, నౌపడలో ఆవు మృతి చెందింది.

నేలకొరిగిన వృక్షాలు

బూర్జ మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారిని అనుకుని ఉన్న బూర్జ నుంచి రాజపేట వరకు పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. రోడ్డుకు అడ్డంగంగా భారీ వృక్షాలు పడిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. తహశీల్దార్ వై.వి పద్మావతి, డిప్యూటీ తహశీల్దార్ సత్యవతి, ఎస్ఐ ప్రవళిక సిబ్బందితో చేరుకుని రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగించే చర్యలు చేపట్టారు. ఈదురుగాలులతో కూడిన వర్షానికి అరటి చెట్లు నేలవాలాయి. జీడి, మామిడికి కొంతవరకు నష్టం వాటిల్లింది.

అకాల వర్షంతో ఉప్పు పంటకు నష్టం

సంతబొమ్మాళి మండలం నౌపడ, మర్రిపాడు ప్రాంతాల్లో అకాల వర్షానికి ఉప్పు పంటకు నష్టం ఏర్పడింది. ఉప్పు ఎండపై ఆధారపడి పండించే పంట. ఏటా డిసెంబరు నుంచి మరుసటి ఏడాది జూన్ వరకు ఈ పంటను రైతులు సాగు చేస్తుంటారు. ఈ ఏడాది నౌపడ పరిసర ప్రాంతాల్లో 400 ఎకరాల వరకు రైతులు ఉప్పు పంటని పండిస్తున్నారు. డిసెంబరు నుంచి ఉప్పు మడులను సిద్ధం చేసి జనవరి, ఫిబ్రవరిలో 15 రోజులకోసారి ఉప్పును పండించి కుప్పలుగా పేర్చి నిల్వ చేస్తుంటారు. బాగా ఎండ కాసే మార్చి, ఏప్రిల్, మేలో వారానికోసారి ఉప్పును పండించి నిల్వ చేస్తుంటారు. మంచి ఎండలు కాసి ఉప్పు చేతికొచ్చే సమయంలో వర్షం కారణంగా మరికొన్ని రోజులు ఉప్పు పండించలేని పరిస్థితి నెలకొంది. రైతులు నిల్వ చేసిన ఉప్పు కుప్పలు అకాల వర్షానికి తడిసిపోవడంతో కొంత ఉప్పు కరిగిపోయి నష్టం వాటిల్లింది.

పిడుగుపాటుకు మృతి చెందిన అప్పన్న

పిడుగుపాటుకు వ్యక్తి, ఆవు మృతి

సరుబుజ్జిలి మండలంలోని పాలవలసకు చెందిన గొర్రెల పెంపకందారుడు దాసరి అప్పన్న (47) పిడుగు పడి సోమవారం మృతి చెందాడు. అప్పన్న గొర్రెలను మేత కోసం చిగురువలస పంచాయతీ పరిధిలోని తాడికొండ వైపు తీసుకెళ్లాడు. సోమవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై, ఈదురుగాలులు వీయడంతో గొర్రెల మందను తాడికొండ వద్ద నిలిపి ఉంచాడు. వర్షం కురుస్తున్న సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో అప్పన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య తులసమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పన్న మరణ వార్తను తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోవడంతో గుండెలవిసేలా విలపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అప్పన్న మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నౌపడ : తడిచిన ఉప్పు పంట

సంతబొమ్మాళి మండల పెద్ద మర్రిపాడులో పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. పెద్ద మర్రిపాడుకు చెందిన రైతు బడ్డ మల్లేష్ తన ఆవును పొలంలో మేతకు వదిలాడు. ఈదురుగాలులతో కూడిన వర్షం సమయంలో పిడుగు పడడంతో పొలంలో ఉన్న ఆవు మృతి చెందింది. వర్షం తగ్గిన తర్వాత మల్లేష్ పొలానికి వెళ్లేసరికి ఆవు విగతజీవిగా పడి ఉంది. సుమారు రూ.40 వేలు విలువ చేసే ఆవు కోల్పోవడంతో ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం పరిహారం అందించాలని కోరుతున్నారు.

నౌపడ : మర్రిపాడులో పిడుగుపాటుకు గురైన ఆవు

రణస్థలం : కురుస్తున్న వర్షం

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

'మీకోసం'కు 119 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలోని పాతపట్నం పాత హౌసింగ్ బోర్డు కాలనీలో జనావాసాల నడుమ ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని గ్రామానికి చెందిన మహిళలు కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో వినతులను స్వీకరించారు. పాతపట్నం నుంచి వచ్చిన మహిళలు మద్యం దుకాణం వల్ల ఎదురవుతున్న సమస్యలను వివరించారు. ఆడపిల్లలు ఈ వీధిలో నివాసం ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఎక్సైజ్ అధికార్లకు విన్న వించుకున్నా పట్టించుకోవడం లేదని మహిళలు కలెక్టర్‌కు వివరించారు. రాష్ట్రంలో బిసి మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు ఇచ్చి... స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా శిక్షణ ఇస్తున్నారని, ఈ పథకంలో పెద్దఎత్తున అవినీతి చోటు చేసుకోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని వైసిపి జిల్లా మహిళా అధ్యక్షులు ఉలాల బారతీదివ్య, నరసన్నపేట మహిళా అధ్యక్షులు రమణమ్మ, కామేశ్వరి, సుగుణారెడ్డి ఫిర్యాదు చేశారు. ఉచిత కుట్టు మిషన్ల వ్యవహారంపై దృష్టి సారించాలని వారు కోరారు. లావేరు మండలం లక్ష్మీపురానికి రేషన్ దుకాణాన్ని మంజూరు చేశారని, డీలరు రెండు నెలలుగా సరకులు ఇవ్వడం లేదని, విఆర్ఒ లాగిన్‌లోనైనా సరకులు పంపిణీకి అనుమతించడం లేదని డి. రమణమ్మ ఫిర్యాదు చేశారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా వ్యక్తిగత, సామాజిక అవసరాలకు 119 వినతులు వచ్చాయి. వినతులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్

పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆయా మండలాల అధికారులకు ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఫిర్యాదులను సమీక్షించుకోవాలన్నారు. పిజిఆర్ఎస్‌లో ఆర్‌డిఒలతో, తహశీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కొందరు అధికారులు సమస్యలపై వస్తున్న వినతులపై శ్రద్ధ చూపకపోవడంతో పదేపదే లబ్ధిదారులు ఫిర్యాదులతో వస్తున్నారని, దీనికి వల్ల పెండింగ్ సమస్యలు పేరుకుపోతున్నాయని అన్నారు. వాటిని తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ శాఖల పరిధిలో ఎక్కడైనా రెవెన్యూ సమస్య ఉన్నట్టయితే నివేదించాలన్నారు. వైద్య ఆరోగ్య, గిరిజన సంక్షేమం, పోలీసు, పంచాయతీరాజ్, డిపిఒ, ఎపిఐఐసి, మున్సిపాలిటీ, జాతీయ రహదారి, రహదారులు, భవనాలశాఖ, ఎపిఇపిడిసిఎల్, ఇరిగేషన్, వంశధార, క్రీడలు తదితర శాఖల సమస్యలపై నివేదికలు కోరారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

ఫాసిజం నుంచి కాపాడింది ఎర్రజెండా

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఫాసిజం నుంచి ప్రజలను కాపాడింది ఎర్రజెండా అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. ఫాసిజం నుంచి ప్రపంచాన్ని కాపాడిన ఎర్రజెండా 80వ వార్షిక విజయోత్సవాన్ని పురస్కరించుకుని ఎచ్చెర్ల మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ 1939లో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడానికి కారణం ఫాసిజం అన్నారు. సోవియట్ సైన్యం వీరోచితంగా పోరాడి వెనక్కి కొట్టిందని, ఈ ఓటమిని తట్టుకోలేక ఫాసిస్టు హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మే 9న జర్మన్ రిచ్‌స్టార్గ్ భవనంపై ఇద్దరు ఎర్ర సైనికులు ఎర్రజెండా ఎగురవేశారన్నారు. ప్రపంచాన్ని ఫాసిజం బారి నుంచి రక్షించిన సోవియట్ రష్యా భారీగా త్యాగం చేయాల్సి వచ్చిందని, రెండు కోట్ల మంది ప్రాణాలర్పించారని తెలిపారు.

అంతకు రెండు, మూడు రెట్లు క్షతగాత్రులయ్యారని, అనేక నగరాలు, పట్టణాలు శిథిలాలుగా మారాయన్నారు. ఎర్రజెండా త్యాగాల వల్ల ఫాసిస్టు నియంతృత్వం నుంచి ప్రజలను కాపాడుకోగలిగామని చెప్పారు. తద్వారా ప్రపంచంలో అనేక జాతీయ విముక్తి ఉద్యమాలకు ఊపు వచ్చిందని దీని ప్రభావం దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో తీవ్రంగా పడిందన్నారు. దేశ ప్రజల వీరోచిత స్వాతంత్రోద్యమానికి ఊపు పెరిగిందని, సోవియట్ యూనియన్ ప్రభావంతో మన దేశం 1947 ఆగస్టు 15న వలస పాలన నుంచి విముక్తి కలిగిందన్నారు. ఇండియా సోషలిస్టు తరహా ఆర్థిక విధానాలు చేపట్టిందని, మిశ్రమ ఆర్థిక విధానం, సంక్షేమ రాజ్యంగా పేరొందిందని... అందుకే రష్యా మనకు కీలక మిత్రునిగా మారిందన్నారు. ప్రస్తుతం మన దేశంలో భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి, మైనారిటీలను టార్గెట్ చేసి మెజారిటీ ప్రజల్లో అసహనం, విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలు పెరిగాయన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, పలు సంఘాల నాయకులు ఎల్.రామప్పడు, డి.బంగార్రాజు, టి.రామారావు, జి.శ్రీనివాసరావు, ఎల్.సీతారాం, చిక్కాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఉదాసీనం

- జిఒ 117ను రద్దు చేయాలి
- సమస్యలు పరిష్కరించుకుంటే విద్యాభవన్ ముట్టడి
- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్
- డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల ధర్నా

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విద్యారంగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ విమర్శించారు. పాఠశాలల పున:వ్యవస్థీకరణ, బదిలీలు, ఉద్యోగోన్నతులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు డిఇఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సమూల మార్పుల పేరుతో కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పున:వ్యవస్థీకరణ ప్రక్రియలో ఏ విధమైన స్పష్టత ఇవ్వకుండా, ప్రభుత్వం జిఒలు విడుదల చేయకుండా రోజుకో ఆలోచన అమలు చేస్తున్నారని చెప్పారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, వాటికి పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. సమస్యలపై విద్యాశాఖ అధికారులు స్పందించకుండా ఏకపక్షంగా చేపడుతున్న చర్యల వల్ల విద్యారంగం నష్టపోతుందన్నారు. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతుల విలీనం, జిఒ 117 పేరుతో సర్దుబాటు ప్రక్రియ చేపట్టి ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించి పనిభారం పెంచిందన్నారు. ఈ జిఒను రద్దు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలంగా తయారు చేస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం హామీనిచ్చిందని గుర్తుచేశారు. ఇచ్చిన హామీకి విరుద్ధంగా గత ప్రభుత్వ బాటలోనే పయనిస్తోందని విమర్శించారు. 117 జిఒ రద్దు చేసి, దాని స్థానంలో కొత్త జిఒ విడుదల చేయాలని, దాని ఆధారంగా పాఠశాలల పున:వ్యవస్థీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 15వ తేదీన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల స్థాయిని దిగజార్చకుండా వారిని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మాత్రమే నియమించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో 45 మంది విద్యార్థుల కంటే అదనంగా ఉంటే రెండో సెక్షన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. బదిలీల ప్రక్రియలో ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్య 75 మించితే టిఎస్ హెచ్‌ఎం పోస్టు అదనంగా మంజూరు చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య 120 మించితే ఆరో ఎస్‌జిటి, ఆ పైన ప్రతి 30 మందికి ఒక ఎస్‌జిటి చొప్పున నియమించాలని డిమాండ్ చేశారు. బదిలీల జిఒ తక్షణం విడుదల చేసి, వేసవి సెలవుల్లో ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ధర్నాలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు, కోశాధికారి బి.రవికుమార్ జిల్లా కార్యదర్శి కె.రమేష్ కుమార్, జి.నారాయణరావు, వై.వాసుదేవరావు, స్వర్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వారెంట్స్ అమలుకు ప్రత్యేక బృందాలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేసుల్లో కోర్టు జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లు, సమన్ల అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు, సమన్ల అమలు, పెండింగ్‌కు గల కారణాలపై నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు కేసుల్లో కోర్టు జారీ చేసిన ఎన్.బి.డబ్ల్యు సమన్ల వివరాలను పోలీస్‌స్టేషన్ల వారీగా ఆరా తీశారు. ఎన్.బి.డబ్ల్యు సమన్లపై నిర్లక్ష్యం వహించకుండా ప్రాధాన్యతా క్రమంలో వాటిని అమలు చేయాలన్నారు. ఆయా సమన్లు, వారంట్లు అమలు చేసేందుకు చేసిన ప్రయత్నం, ప్రగతి తదితర అంశాలపై పూర్తి స్థాయిలో ఆరా తీసి పెండింగ్ ఎన్.బి.డబ్ల్యూ త్వరితగతిన అమలు చేయాలని సూచించారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, శారీరక దాడులు, మోసం, గృహ హింసం, హత్య, అట్రాసిటీ, పోక్సో వంటి కేసుల్లో జారీ చేసిన ఎన్.బి.డబ్ల్యు అమలుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమన్ల వివరాలు తెలుసుకునేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ప్రాసెస్ రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఎన్.బి.డబ్ల్యుదారుల వ్యక్తిగత వివరాలు, చిరునామా, ఇతర ఆధారాలు, సాంకేతికతను అనుసరించి వారిని గుర్తించి కోర్టులో హాజరు పరచాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎఎస్‌పి కె.వి రమణ, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ నేతాజీ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న గిరిజనులు

గిరిజన భూములకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- కొత్తూరు, హిరమండలం

హిరమండలం మండలం గుళుమూరు పంచాయతీ జగన్నాథపురం గిరిజనులు భూములను రక్షణ కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్నలు డిమాండ్ చేశారు. ఈ మేరకు హిరమండలం మండలం తహశీల్దార్ కార్యాలయం వదకద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనుల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు జీవనోపాధి కోసం 40 ఏళ్ల క్రితం సర్వే నంబరు 284, 284 బి1లో భూ పంపిణీ చేసి హక్కు పత్రాలు ఇచ్చిందని తెలిపారు. గిరిజనులు సాగులో ఉన్న భూములను కొండరాగోలుకు చెందిన భూస్వాములు తప్పుడు కాగితాలు చూపించి గిరిజనులు భూములను ఆక్రమించారని, తహశీల్దార్ జోక్యం చేసుకుని గిరిజనులు భూములను రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఊలక దాసు రుగడ నర్సయ్య, ఆదిలక్ష్మి, భీముడు, చిన్నమ్మి, గార రామయ్య, సేతోడు, సిఐటియు నాయకులు పి.కృష్ణ పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి చర్యలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పర్యాటక అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పర్యాటకశాఖపై సోమవారం ఆయన జూం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రణస్థలం మండలంలోను, కళింగపట్నం, బారువా, భావనపాడు, తదితర బీచ్‌ల అభివృద్ధికి సవివరణ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని ఆదేశించారు. కవిటి బీచ్‌ను పర్యాటకులకు అనుగుణంగా ఉన్న స్థలాన్ని గుర్తించాలని అటవీశాఖ, పర్యాటక శాఖల అధికారులకు సూచించారు. రూరల్ టూరిజం కింద ఫారెస్టు ఏరియాలో ఎకోఫ్రెండ్లీ ప్రాజెక్టు పర్యటకంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉన్న వరకు సవివరణ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని ఆదేశించారు. కళింగపట్నం బీచ్‌ను స్వదేశీ దర్శనం ద్వారా అభివృద్ధి చేయాలని పర్యాటకశాఖ అధికారులు కోరారు. బీచ్‌ల అభివృద్ధికి ముందుకు వచ్చే ఎక్స్‌ప్రెసన్స్ ఆఫ్ ఇంట్రెస్ట్ ఉన్న వారిని పిలవాలని ఆదేశించారు. బారువా బీచ్‌లో ప్రస్తుతం వాటర్ స్పోర్ట్స్ ఏమేమి జరుగుతోందని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బారువాలో సీ కయాకింగ్, ఎటివి వెహికిల్ పనులు చేపడుతున్న పర్యాటక అధికారి నారాయణరావు వివరించారు. బారువా బీచ్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో బారువా బీచ్ అభివృద్ధికి బలరాం నాయుడు ముందుకు వస్తారని పర్యాటక అధికారి తెలిపారు. సమావేశంలో జిల్లా ఫారెస్టు అధికారి వెంకటేష్, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

బూర్జ : మండలంలో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.నగేష్ సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన గృహాల్లో జూన్ 12న గృహప్రవేశాలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. 2019-20 మధ్యలో పిఎంఎవై, బిఎల్‌సి యుడిఎలకు సంబంధించి మండలంలో 134 జగనన్న గృహాలు మంజూరు అయ్యాయని అన్నారు. అందులో అరవై నాలుగు గృహాలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 70 గృహాలనూ సత్వరమే పూర్తి చేసేందుకు సిబ్బంది సహకరించాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించి గృహ నిర్మాణాలు పూర్తిచేసేందుకు సహకరించాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ తిరుపతిరావు, డిఇఇ డి.సన్యాసిరావు, ఎఇ ధర్మేంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా రవాణాపై దృష్టి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

రికార్డులను పరిశీలిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

నాటుసారా అక్రమ రవాణా, అమ్మకాలపై దృష్టి సారించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ఇచ్ఛాపురం సరిహద్దు పురుషోత్తపురం చెక్‌పోస్టు, ఎక్సైజ్ స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటుసారా తయారీ, అమ్మకాలు, రవాణాపై ముమ్మరంగా దాడులు చేపట్టాలని ఆదేశించారు. దత్తత ఎక్సైజ్ కానిస్టేబుల్‌తో మాట్లాడుతూ గ్రామాల్లో నాటు సారా, అక్రమ మద్యంపై గట్టి నిఘా ఉండాలని సూచించారు. మద్యం దుకాణాల్లో అధిక ధరల అమ్మకాలపై దృష్టిసారించి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం రికార్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. పై తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు.

సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్వాడీలు

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి- కొత్తూరు

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు ఎస్.ధనలక్ష్మి, జలజాక్షి, రజని కోరారు. ఈ మేరకు పిడిఒకు ప్రాజెక్టు అధికారులకు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కొత్తూరు ప్రాజెక్టు పరిధిలో ఐదేళ్ల మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. అలాగే ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సుభాషిని, నిర్మల, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తిలక్

ప్రజా ధనాన్ని దోచుకుంటున్నారు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మైనింగ్, లిక్కర్ మాఫియాతో కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆరోపించారు. టెక్కలి వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ, మండలస్థాయి అనుబంధ విభాగాల అధ్యక్షులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి సానుభూతిపరులకు చెందిన స్టోన్ క్రషర్లను మూసివేయించి కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వారితో అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్ కార్యకలాపాలు చేపడుతూ వారి వద్ద నుంచి కోట్ల రూపాయల కమిషన్లు గుంజుకుంటున్నారని ఆరోపించారు. యోజకవర్గంలో కుటుంబం, తమ అనుచరుల మద్యం వ్యాపారం చేస్తూ గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు నిర్వహించడం, అక్రమంగా ఒడిశా తయారైన మద్యాన్ని విక్రయిస్తూ కోట్లు కొల్లగొడుతున్నారని విమర్శించారు. అనంతరం పహల్గామ్ దాడిలోను, కాశ్మీర్ సరిహద్దుల్లో జరుగుతున్న యుద్ధంలో మృతిచెందిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నందిగాం ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, సంతబొమ్మాళి జెడ్పిటిసి వసంతరెడ్డి, కోటబొమ్మాళి మండల వైసిపి అధ్యక్షులు సంపతిరావు హేమసుందరరావు, టెక్కలి మండలం వైసిపి అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వరరావు, టెక్కలి ఎంపిపి ప్రతినిధి అట్ల రాహుల్, సత్తారు సత్యం పాల్గొన్నారు.

రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

కోర్టు భవనాల నిర్మాణాలు చేపట్టాలి

పొందూరు: స్థానిక జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు భవన సముదాయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి త్వరగా కోర్టు నిర్మాణం జరిగేలా చూడాలని బార్ అసోసియేషన్ సభ్యులు ఎంఎల్ఎ కూన రవికుమార్‌ను కోరారు. బార్‌అసోసియేషన్ సభ్యులు సోమవారం రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. టిడిపి హయాంలో మంజూరైన కోర్టు ఇంకా ప్రవేటు భవనంలోనే నడుస్తోందని, టిడిపి ప్రభుత్వమే కోర్టు భవన సముదాయాల నిర్మాణానికి స్థలం మంజూరు చేసినా నిధులు లేక నిర్మాణం జరగలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈవిషయాన్ని తాను సిఎం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి నిర్మాణాలు పూర్తయ్యేలా చూస్తానని బార్ అసోసియేషన్ సభ్యులకు రవికుమార్ హామీ ఇచ్చారు. న్యాయవాదులు కె.కృష్ణారావు, కె.అశోక్, వై.బ్రహ్మాజీ, పి.రామ్మోహన్. ఎం.రాము, కె.సన్యాసప్పుడు తదితరులున్నారు.

గౌతమ్‌కుమార్‌కు అవార్డు

అవార్డును అందుకుంటున్న గౌతమ్‌కుమార్

కోటబొమ్మాళి: సినీ హీరో సుమన్ చేతులు మీదుగా విశాఖపట్నంలో కరాటేలో డెన్ 4బెల్ట్ అవార్డును కోటబొమ్మాళి విద్యుత్ నగర్‌కు చెందిన సోమ గౌతంకుమార్ సోమవారం అందుకున్నారు. వికాస్ చీఫ్ పౌండర్ మల్లికార్జునగౌడ్ ఆధ్వర్యాన నిర్వహించిన అవార్డుల పంపిణీలో హీరో సుమన్ ముఖ్యఅతిథిగా అందజేశారు. గౌతమ్‌కుమార్ స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

భూముల కోసం కదంతొక్కిన దళితులు

- తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా
- తహశీల్దార్ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన వ్య.కా.స నాయకులు

ప్రజాశక్తి- బూర్జ

దళితులు తమ సాగులో ఉన్న భూముల కోసం కదం తొక్కారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. దళితులు, నిరుపేద రైతులు సాగులో ఉన్న భూములను తక్షణమే వారికి అప్పగించడంతో పాటు డి పట్టాలు మంజూరు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. అన్నంపేట గ్రామంలో 80 ఏళ్లుగా గ్రామానికి చెందిన దళితులు, మరి కొంతమంది నిరుపేద రైతుల సాగులో ఉన్న భూములను ఇటీవల ఓ అజ్ఞాత పెత్తందారు దౌర్జన్యంగా పేదల భూములను కబ్జా చేయడమే కాకుండా ఆ భూముల్లో స్తంభాలను పాతి పెడుతున్నాడని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరావు సింహాచలం అన్నారు. దశాబ్దాల కాలంగా దళితుల సాగులో ఉన్న భూములను కేవలం రాజకీయ పలుకుబడితో పెత్తందారుడు దౌర్జన్యంగా ఆక్రమించుకోవడం సరికాదన్నారు. అధికారులు ఈ విషయంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి నిరుపేద రైతుల సాగులో భూములను తిరిగి వారికే అప్పగించి వెంటనే డి పట్టాలను మంజూరు చేసి వారికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

తహశీల్దార్ నిర్లక్ష్య వైఖరిపై నిరసన

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ వెంకట పద్మావతిపై నిరసన తెలిపారు. దళితులకు, పేదలకు న్యాయం చేయాలని ధర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రం ఇచ్చేందుకు తహశీల్దార్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా సుమారు గంటన్నర పాటు ఎదురు చూస్తే స్థానిక తహశీల్దార్ వినతిపత్రం అందుకునేందుకు కూడా రాకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 23న ఇదే విషయంపై తహశీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అయినప్పటికీ ఈ సమస్యను పరిష్కరించడంలో తహశీల్దార్ విఫలమయ్యారని, నిర్లక్ష్య వైఖరిని అవలంభించారన్నారు. కార్యాలయంలో ఉన్న తహశీల్దార్ తమను కనీసం పట్టించుకోలేదని, ఆమె తీరుపై

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న వ్యకాస నాయకులు, రైతులు

పెద్దఎత్తున నినాదాలు చేశారు. తహశీల్దార్ వ్యవహారం అనుమానం కలిగిస్తుందని, సమస్యను వివరించి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన తమను పట్టించుకోకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే దళితుల భూములను తక్షణమే వారికి కేటాయించాలని నినాదాలు చేశారు. లేనిపక్షంలో తమ సంఘం తరపున పెద్దఎత్తున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అయితే తహశీల్దార్ ఎంత సేపటకి వినతిపత్రం అందుకునేందుకు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘసభ్యులు, దళితులు ఒక్కసారిగా తహశీల్దార్ ఛాంబర్ లోకి దూసుకుపోయారు. పరిస్థితి విషమించడంతో స్థానిక ఎస్ఐ ప్రవల్లిక తన సిబ్బందితో తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి సంఘ సభ్యులను శాంతింప చేశారు. అనంతరం దళితులు, కార్మిక సంఘ సభ్యులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో వ్యకాస మండల నాయకులు కంఠ అప్పల నాయుడు, వైసిపి నాయకులు ఎం.కిరణ్‌కుమార్, టిడిపి నాయకులు ఎస్.దుర్గారావు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

లావేరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- లావేరు

ఈ నెల 20న అఖిలభారత సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి. రమణ పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక హక్కులు కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20న చేపట్టనున్న సమ్మె జయప్రదం చేయాలని సోమవారం లావేరులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నియంత్రించాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్.ఐ.సి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బి.ఉత్తర, ఎల్.లక్ష్మి ఎస్.కృష్ణవేణి ఎ.ఈశ్వరరావు, టి. సత్యవతి, కె.పద్మ, ఎల్.సాయిలక్ష్మి, ఎన్.రుద్రయ్య పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ఎచ్చెర్ల: ఈ నెల 20న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని ఎన్ఎసిఎల్ పరిశ్రమ, ఎపిబిసిఎల్ (ఐయంఎల్) డిపో వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికెమ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అంబటి సత్యనారాయణ, టి.రవికుమార్, వెంకటేష్, వరదరాజు, ఎల్.రామప్పడు, ఎం.రమణ, ఎపిబిసిఎల్ హమాలీస్ యూనియన్ నాయకులు డి.బంగార్రాజు, ఎన్.రమణ, శ్రీనివాసరావు, టి.రామారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి సందర్శన

నందిగాం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీక్యాథరిన్ సోమవారం పరిశీలించారు. ఓపి, హాజరు పట్టికను పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఈయనతో వైద్యాధికారి కె. అనిత కుమారి, సీనియర్ సహాయకులు శ్రీనివాసరావు ఉన్నారు.

జీతాల పెంపుపై హర్షం

నౌపడ : గెస్ట్ లెక్చరర్ల జీతాల పెంచుతూ విడుదల చేసిన జిఒపై ఎపి గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ కోశాధికారి బడ్డ గణేష్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలకు రూ.పది నుంచి 20 వేలు జీతాలు పెంచుతూ జిఒ విడుదల చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి మంత్రులు లోకేష్, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రౌతు పోలమ్మతల్లి ఉత్సవాలు

సోంపేట: మండలంలోని పాలవలసలో గ్రామ దేవత రౌతు పోలమ్మ తల్లి సంబరాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాత్రి మేళ తాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. తొమ్మిది రోజులు పాటు నిర్వహించే సంబరాల్లో పాల్గొనే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం కూచిపూడి డాన్స్, బుధవారం విశాఖపట్నం కళాకారులచే డాన్స్ బేబీ డాన్స్, గురువారం రోషన్ లాల్ ఆర్కెస్ట్రా, కోయ డాన్స్, వివిధ నేల నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం జబర్దస్త్ టీం హైపర్ ఆది, శాంతి స్వరూప్, దొరబాబు, కుమార్ మాస్టర్ల షో ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు.

అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు

పాతపట్నం : మండలం కేంద్రంలోని నీల మణి దుర్గ అమ్మవారి హుండీ ఆదాయం సోమ వారం లెక్కిం చారు. 53 రోజులు ఆదాయం రూ.7,31,962 వచ్చిందని ఇఒ టి.వాసుదేవరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివప్రసాద్, సంతోష్‌కుమార్, సహాయ కమిషనర్ కార్యాలయం నుంచి జి.వి.బి.ఎస్.రవికుమార్, ఇఒ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి మరింత కృషి

ఆమదాలవలస : శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: మహిళలు ఆర్థిక స్వావలంబనతో ఎదగాలని, మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో బిసి కార్పొరేషన్ ద్వారా చేపట్టిన మహిళల కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు మహిళా పక్షపాతి అన్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారం చేపట్టిన నాటి నుంచి మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ ప్రత్యేక స్థానం కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సిఎం చంద్రబాబు స్వయంశక్తి సంఘాలను ఏర్పాటు చేసి మహిళలను చైతన్య వంతులుగా చేశారన్నారు. అలాగే వివిధ సంక్షేమ పథకాలు, రుణాలు కార్పొరేషన్‌ల ద్వారా మహిళలకు ప్రత్యేక శిక్షణలు ఏర్పాటు చేసి స్వయం ఉపాధి కల్పనకు మరింత కృషి చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మహిళలకు కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఆశయాలను నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్. వెంకటరావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు సంపదరావు మురళీ, ఎంపిటిసిలు అన్నెపు భాస్కరరావు, గొర్లె సూర్యం సర్పంచ్ సనపల చెల్లం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: బిసి కార్పోరేషన్ ఆధ్వర్యాన మహిళల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. నగరంలోని గొంటి వీధి, గార మండల కేంద్రంలో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బిసి కార్పోరేషన్ ఇడి గడ్డెమ్మతో పాటు ఇతర అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సమావేశాలకు సమయపాలన పాటించరా...?

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

పొందూరు: సమావేశాలకు, ప్రజాప్రతినిధుల సమీక్షలకు అధికారులు సమయపాలన పాటించరా అని మండల అధికారులపై ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి రవికుమార్ హాజరయ్యారు. ఎమ్మెల్యే 11 గంటలకు సమావేశానికి చేరుకునే సమయానికి కేవలం నలుగురు మాత్రమే హాజరు కావడంపై మండిపడ్డారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలపైనే చర్చ జరిగింది. రేషన్ పంపిణీలో ఎండియు వాహనాల సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని, 15వ తేదీ దాటినా పట్టణంలో కార్డుదారులకు రేషను సరుకులు అందడం లేదని ఎంపిటిసి-4 బాడాన హారిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. పట్టణంలో ఎండియు సిబ్బందికి రేషను సరఫరా బాధ్యతల నుంచి తప్పించి రేషను డీలర్లకు అప్పగించాలని ఆదేశించారు. భూరికార్డుల సవరణకు ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చిందని పొరపాటున 22 -ఎ రికార్డుల్లో నమోదైన ప్రవేటు భూముల నమోదును సవరించాలని, ప్రభుత్వ, దేవాదాయభూములు ప్రవేటు భూములుగా నమోదైనా వాటిని 22-ఎ రిజిష్టరులో చేర్చాలని తహశీల్దార్‌ను

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆదేశించారు. పొందూరు పైడికొండ 42, 39 సర్వే నంబర్లలో ఎసైన్మెంట్ కమిటీ ఆమోదం లేకుండా పొందిన ఫేక్ డి-పట్టా భూములపై నివేదిక ఇవ్వాలని తహశీల్దార్ ఆర్.వెంకటేష్‌ను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సమయానికి హాజరుకావడం లేదని పలువురు ఎంపిటిసి ఫిర్యాదుపై సచివాలయాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఎంపిడిఒ మన్మథరావు, తహశీల్దార్‌లకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పైడిప్రసాద్. బి.పోలినాయుడు. జె.శ్రీనివాసరావు. ఆర్.లక్ష్మి, పి.వేణుగోపాలరావు ఎంపిటిసిలు సీతా రామరావు, హనుమంతురావు, అన్నెపు కుమారి, బాడాన హారిక, కె.చల్లమాంబ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మొక్కలను పరిశీలిస్తున్న విమలరాణి

అంగన్వాడీ కేంద్రం సందర్శన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గొప్పిలి సెక్టార్ పరిధిలో పలు అంగన్వాడీ కేంద్రాలను పాతపట్నం సిడిపిఒ విమలరాణి సోమవారం సందర్శించారు. గొప్పిలి, భరణికోట, భరణికోట కాలనీ, ముక్తాపురం, చంపాపురం తదితర కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. రక్తహీనత పిల్లలకు పలు సూచనలు చేశారు. చిన్న పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని సూచించారు. పౌష్టికాహారాన్ని అందించాలని, సమయపాలన పాటించాలని, సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పెరడి తోటలోని మొక్కలను పరిశీలించారు.

టెక్కలివాసి నేత్రదానం

చిట్టిబాబు (ఫైల్)

శ్రీకాకుళం: జిల్లాలోని టెక్కలి చిన్నబజార్‌కు చెందిన కింతలి చిట్టిబాబు (69) సోమవారం మృతి చెందారు. ఆయన అభీష్టం మేరకు కుమారులు తిరుమలకుమార్, సురేష్ కుమార్, అల్లుడు డి.నేతాజీ గుప్తా జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ నేత్ర సేకరణ కేంద్రానికి సమాచారం అందించారు. ఈ మేరకు రెడ్‌క్రాస్ సభ్యులు కార్నియాను సేకరించి ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపించారు.

అన్న వితరణను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

అర్జీదారులకు అన్న వితరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి ప్రతి సోమవారం వచ్చే ఫిర్యాదుదారులకు దాతల సహకారంతో అన్నవితరణ, మజ్జిగ సరఫరా అందజేస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. సోమవారం జిల్లా పరిషత్ ఆవరణలో సిఎంఆర్ యాజమాన్యం ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ, భోజన వితరణ కార్యక్రమాన్ని జెసి ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎంఆర్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతివారం ఫిర్యాదుదారులకు భోజనం అందించడానికి దాతలు ముందుకు రావాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతివారం 150 నుంచి 200 మందికి మజ్జిగ, భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, సిఎంఆర్ యాజమాన్య ప్రతినిధి రమణ తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా ప్రకటించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను వెంటనే ప్రకటించాలని ఎపిడబ్ల్యుఇఎఇఎ గౌరవ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వెల్ఫేర్ అసిస్టెంట్ల సీనియార్టీ జాబితాను తయారు చేసి విడుదల చేయాలని, అలాగే పదోన్నతులు కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కలెక్టర్ స్పందిస్తూ వినతిపత్రాన్ని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్‌కు పంపించి త్వరలోనే సీనియార్టీ జాబితాను విడుదల చేసేలా ఆదేశాలు జారీ చేస్తానని తెలిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు బడే సుసాన్న, కార్యదర్శి దున్న వేణుగోపాలరావు, కోశాధికారి కె.జగపతి బాబు, ఉపాధ్యక్షులు కె.సంధ్య, వి.షణ్ముఖరావు, మహమ్మద్ అజీద్, సుధీర్ పాణిగ్రహి, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

కూతురు పుట్టినరోజు నాడే తండ్రి మరణం

మరో ఇద్దరికి గాయాలు

హరీష్‌రావు (ఫైల్)

ప్రజాశక్తి- రణస్థలం

ఆదివారం కుమార్తె ఉత్తర నాలుగో పుట్టినరోజు కావడంతో బొద్దాన హరీష్‌రావు తన స్నేహితులతో కలిసి రాత్రి 9 గంటల సమయంలో ఇంటివద్ద బిర్యాని తయారు చేయించి రణస్థలం నుంచి పైడిభీమవరం వరకు జాతీయ రహదారిపై తిరిగే బిక్షగాళ్లకు పంపిణీ చేసుకుని ఆనంతరం పైడిభీమవరం డాబా హోటల్‌లో స్నేహితులతో కలిసి భోజనాలు చేసి రాత్రి 12 గంటలకు మూడు ద్విచక్ర వాహనాలతో తొమ్మిదిమంది పైడిభీమవరం నుంచి రణస్థలం వచ్చేందుకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం నెలివాడ జంక్షన్ వద్ద అదుపు తప్పి రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో రోడ్డు ప్రమాదం జరిగింది. కుమార్తె ఉత్తర పుట్టినరోజు, అలాగే బావమరిది నడగల రాంబాబు పుట్టిన రోజు ఆదివారమే కావడంతో స్నేహితులతో సరదాగా గడిపి ఇంటికి వస్తున్న యువకుడికి అదే చివరి రోజైంది. స్నేహితులతో కలిసి భోజనం చేసి వస్తానని భార్య ఉమాకు చెప్పి వెళ్లిన ఆ భర్తకు రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. దీంతో పాప పుట్టినరోజు నాడే ప్రాణాలు కోల్పోయి ఇటు కన్నవారిని, భార్య, పిల్లలకు తీవ్ర విషాదంలోకి నెట్టాడు. ప్రమాద వివరాల్లోకి వెళ్తే... జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారి నెలివాడ జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రణస్థలం మండల కేంద్రానికి చెందిన బొద్దాన హరీష్‌రావు (25) మృతి చెందగా, ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న సీతంవలస గ్రామానికి చెందిన కొరాడ దుర్గారావు, రణస్థలంకు చెందిన గొర్లె భాస్కరరావు గాయపడ్డారు. మృతుడు హరీష్‌రావుకు సీతంవలస గ్రామానికి చెందిన ఉమాతో ఆరేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ఉత్తరకు నాలుగేళ్లు, కుమారుడు రేవంత్‌కు ఆరు నెలలు కావస్తోంది. మృతుడు స్థానిక యునైటెడ్ బ్రేవరీస్ (బీరు పరిశ్రమలో) పనిచేస్తున్నాడు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న జె.ఆర్.పురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ముగ్గురిని స్థానిక సూర్య ఆస్పత్రికి తీసుకుని వచ్చి ప్రథమ చికిత్స చేయించారు. హరీష్‌రావు ఆస్పత్రిలో మృతి చెందగా, గాయపడిన దుర్గారావు, భాస్కరరావులను మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన హరీష్‌రావు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

మూడు లారీలు ఢీ : క్లీనర్ మృతి

మృతి చెందిన క్లీనర్ రమేష్

లావేరు: మండలంలోని తాళ్లవలస పంచాయతీ రావివలస సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి మూడు లారీలు ఢీకొన్న ఘటనలో లారీ క్లీనర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న రెండు లారీలు రావివలస సమీపంలో ఒకదాన్ని మరొకటి వెనుకనుంచి ఢీకొనడంతో రెండు లారీలు చిన్న డామేజ్ కావడంతో రెండు లారీల వారు చర్చలు జరుపుకుంటున్న సమయంలో అదే రహదారి గుండా వెనుక వైపు నుంచి మూడో లారీ బలంగా ఢీకొనడంతో అందులో ఉన్న ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం లింగాల గ్రామానికి చెందిన క్లీనర్ రమేష్ లారీలో చిక్కుకుని మృతి చెందాడు. ఎస్.జి.లక్ష్మణరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ మృతి

శ్రీనివాసరావు (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని మునసబుపేట గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్, కవి పులఖండం శ్రీనివాసరావు(65) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. శ్రీనివాసరావు ఉదయం లేచి తన పనులు తను చేసుకుంటూ మధ్యాహ్నం భోజనం చేసి అనంతరం మూడున్నర సమయంలో ఛాతి దగ్గర నొప్పి వస్తుందని భార్యకు చెప్పడంతో వెంటనే వారు ఒక వాహనంతో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్యం అందిస్తుండగా మరణించారని వైద్యులు ధ్రువీకరించారు. శ్రీనివాసరావు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఎ, బరంపురం విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి చదివారు. 1991 అధ్యాపకులుగా, అనంతరం ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. 1998లో తెలుగు విద్యార్థులకు కావ్య నాటకాలు, ప్రాచీన సాహిత్యం, సాహిత్య విమర్శ పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధిస్తూ తెలుగుభాష గొప్పతనాన్ని తెలిపారు. వీటితో పాటు పలు అంశాలపై ధారావాహిక వ్యాసాలు కూడా రాశారు. రాష్ట్ర గ్రంథాలయ సమితి జిల్లా శాఖ గౌరవ అధ్యక్షులుగా 2015లో పదవి పొందారు. ఆకాశవాణి ప్రసార రంగంలో యక్షగానాలు, పోతన పలు అంశాలను ప్రసంగించారు. రచన రంగంలో హరికథా విలాసం, ఆకాశవాణితో నా సంబంధం పలు నవలలను రాశారు. ఈయనకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

బస్సు ఢీకొని మహిళకు గాయాలు

ఎచ్చెర్ల: మండల పరిధిలో కుశాలపురం సమీపంలో

క్రైమ్ కార్నర్

సింహద్వారం వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళ తీవ్ర గాయాలపాలైంది. పోలీసుల వివరాల మేరకు బుడుమూరు గ్రామానికి చెందిన గుడ్ల లావణ్య నవభారత్ కూడలిలో తన కన్నవారి ఇంటికి స్కూటీపై ఉదయం వచ్చింది. ఆమె సాయంత్రం బుడుమూరు వెళ్లే క్రమంలో కుశాలపురం సింహద్వారం వద్ద సర్వీస్ రోడ్‌లో స్కూటీతో యూటర్న్ తీసుకుంటుండగా బొబ్బిలి నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న ఆర్‌టిసి అద్దెబస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైంది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను 108 అంబులెన్స్‌లోశ్రీకాకుళంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె భర్త గుడ్ల సూర్యప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.కృష్ణ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నెహ్రూ నగర్‌లో కొట్లాట

పలాస: స్థానిక నెహ్రూ నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఇరు గ్రూపుల కొట్లాటలో బి.గోపి అనే వ్యక్తి గాయపడ్డాడు. తనను హతమార్చేందుకు ప్రత్యర్థులు వచ్చారని, తప్పించు ప్రయత్నించినా తలకు తీవ్రగాయమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ పి.సూర్యనారాయన కేసు దర్యాప్తు చేశారు. గోపి మద్యం తాగి తనకు ఇబ్బంది పెడుతున్నాడని రవి భార్య వందకు ఫోన్ చేసింది. పోలీసులు గోపి ఇంటికి చేరుకున్నారు. ఉద్దేశపూర్వకంగా తనపై ఫిర్యాదు చేశారని గోపి పోలీసులకు చెబుతూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చీకటిలో కాపుకాచిన బి.రవి, వి.భరద్వాజ్. వి.లక్ష్మణలు దాడికి దిగారన్నారు. ఈ సంఘటనలో గోపి తల, కన్నుపై తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పాతకక్షల కారణంగా కొట్లాట జరిగిందని పోలీసులు తెలిపారు. గోపిని టిడిపి నాయకులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, ఎ.రామకృష్ణ ఆస్పత్రిలో పరామర్శించారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం : మండలంలోని బూర్జపాడులో అక్రమంగా నాటుసారా తరలిస్తున్న శివంగి మాధవరావును అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి 12 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ మొబైల్ పెట్రోలింగ్ సిఐ జి.వి.రమణ తెలిపారు. ఎక్సైజ్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీ సిఐ, సిబ్బంది కలిసి బూర్జపాడు వద్ద తనిఖీ చేయగా మాధవరావు పట్టుబడగా అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కొత్తూరు : మండలంలోని పొన్నుటూరు నది తీరంలో సోమ వారం ఒరిశాకు చెందిన రెండు ట్రాక్టర్లు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ కె.బాలకృష్ణ సోమవారం దాడులు నిర్వహించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.పది వేలు అపరాధ రుసుం విధించారు.

భారీగా బెల్లం ఊటలు ధ్వంసం

కొత్తూరు: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, పాలకొండ మొబైల్ పార్టీ సిఐ, కొత్తూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ సిబ్బంది, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆమదాలవలస, పొందూరు, విజయనగరం, చీపురుపల్లి ఇఎస్‌టిఎఫ్ ఆధ్వర్యాన ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో సోమవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. కొత్తగూడ, మంగళగూడ, కంగువగూడ గ్రామాల్లో దాడులు చేసి 23 వేలు పులిసిన బెల్లం ఊటలు, 440 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో పాలకొండ మొబైల్ పార్టీ సిఐ మురళి, కొత్తూరు సిఐ కిరణ్మయి, పాలకొండ ఎస్ఐలు జి.ఫణింద్రబాబు, ఎల్.తిరుపతిరావు, ఎ.వాసుదేవరావు పాల్గొన్నారు.

వేతన సవరణను ఆమోదించాలి

కాష్యూ లేబర్ అసోసియేషన్ నాయకులు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ జీడి కార్మికులకు ప్రతి రెండేళ్లకు ఒకసారి వేతన సవరణలు జరుగుతున్నాయని, రెండేళ్ల క్రితం జరిగిన వేతన సవరణకు 30 శాతం అదనంగా కలిపి అమలు చేయాలని క్యాజు లేబర్ అసోసియేషన్ నాయకులు అంబటి ఆనందరావు, నీల గణపతిలు అన్నారు. ఈ మేరకు సోమవారం పలాస క్యాషు అసోసియేషన్ (పిసిఎంఎ) అధ్యక్షులు మల్లా శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒప్పందం ప్రకారం వేతన సవరణ కచ్చితంగా అమలు చేయాలన్నారు. కార్మికులు పొందే వేతనాలకు సంబంధం లేకుండా ప్రభుత్వం పేదలకు ఇచ్చే సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు శిష్టు గోపి, గజ్జ బాలయ్య, కోవిరి జగన్ పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

రణస్థలం రూరల్: నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవన నిర్మాణాలు, వాటి స్థితిగతులు వంటి అంశాలపై సోమవారం ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తన క్యాంప్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ శాఖ, ఐసిడిఎస్ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా వాటిని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అందులో భాగంగా గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఫోన్‌లో వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో కేంద్రం నుంచి నిధులు మంజూరు కానున్నాయని, వచ్చిన వెంటనే పనులు పూర్తి చేద్దామన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ డిఇఇ ససపల శ్రీరామమూర్తి, సిడిపిఒ ఝాన్సీరాణి, ఎఇలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

శిబిరాలను వినియోగించుకోవాలి

మాట్లాడుతున్న విద్యార్థిని

ప్రజాశక్తి- టెక్కలి

విద్యార్థులకు వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి పి.విలియం అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రజా చైతన్య కళా సమితి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో నేర్చుకుంటున్న వివరిస్తున్న విషయాలపై విద్యార్థులు అవగాహన పెంచుకొని తరగతి గదిలో వాటిని వినియోగించుకోవాలని కోరారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువుతోపాటు ఇతర రంగాలపై ఆసక్తి కనబరచాలన్నారు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డి.ఎ.స్టాలిన్ వేసవి శిక్షణా శిబిరంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఉత్తర కవాటం గణపతి, కార్యదర్శి చిలుకు కృష్ణారావు, నిర్వాహకులు మూల తాతయ్య, అనిశెట్టి చిట్టన్న రోణకి విజయ్‌కుమార్, ఆర్.వి.రమణమూర్తి, కుప్పిలి కామేశ్వరరావు, బి.అయ్యాబాబు, డొంకన పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆరోపణలు అవాస్తవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బిసి మహిళల కోసం రాష్ట్ర వ్యాప్తంగా కుట్టుమిషన్లను పంపిణీ చేస్తే అందులో అవినీతి జరిగిందంటూ జగన్, ఆయన అనుచరులు ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి అవాస్తవాలను ప్రజలు నమ్మరని టిడిపి బిసిసెల్ జిల్లా అధ్యక్షులు కళగ జగదీష్ విమర్శించారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలకు రాజకీయ, సామాజిక గుర్తింపుతో పాటు ఆర్థిక అభివృద్ధి కల్పిస్తుంటే చూసి ఓర్వలేక స్కీంలను స్కామ్‌లుగా ప్రచారం చేస్తూ ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఐదేళ్ల పాటు ప్రజాధనాన్ని లూటీ చేసి లిక్కర్, మైనింగ్, భూముల పేరుతో రూ.వేల కోట్లు దోపిడీకి వైసిపి నాయకులు పాల్పడ్డారన్నారు. ఐదేళ్ల పాటు ఎస్‌సి, ఎస్‌టి, బిసి సబ్‌ప్లాన్ నిధులు ఏం చేశారో ప్రజలకు చెప్పాలన్నారు.

మాట్లాడుతున్న జగదీష్

తిరుపతిరావుకు సత్కారం

ప్రజాశక్తి- సోంపేట

గణిత అష్టావధాని మడు తిరుపతిరావు గణితంలో వినూత్నంగా రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఎంపికయ్యారు. మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర శివాజీ గణిత అష్టావధానిని సోమవారం అభినందించి దుశ్శాలువతో సత్కరించారు. తిరుపతిరావు మాస్టర్ మేధాశక్తిని, నిరంతరం గణితంపై చేస్తున్న వినూత్న కార్యక్రమాలను కొనియాడారు. విద్యార్థులకు గణితంపై అభిరుచి, ఆసక్తి కలిగే గణిత చిట్కాలు, గణిత తమాషాలు వినోదకరమైన అంశాలను పుస్తక రూపంలో తీసుకోరావాలని దానిని నేను ఆవిష్కరిస్తానని సూచించారు.

తిరుపతిరావు అభినందిస్తున్నశివాజీ

పురస్కారాన్ని అందుకుంటున్న కుమార్ రాజా

కుమార్‌రాజాకు ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సాహితీ రంగంలో అనేక సేవలందిస్తున్న ప్రముఖ కవి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బర్రి కుమార్ రాజాకు జాతీయ స్థాయిలో సాహితీ రత్న పురస్కారం లభించింది. శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభి షేక మహోత్సవాల్లో భాగంగా ఏలూరులో సాహితీ రత్న పురస్కారంతో పాటు మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి- లావేరు

ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి విద్యార్థి ప్రపంచం దేశాల కోసం తెలుసుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం లావేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రపంచ పటం, గ్లోబ్ అందులో ఉన్న ముఖ్యమైన సమాచారాన్ని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి జనరల్ నాలెడ్జి పుస్తకాలు చదివి విజ్ఞానం పెంపొందించు కోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

టెక్కలి : ప్రతి విద్యార్థి చదువుతోపాటు వివిధ రకాల శతక పద్యాలను నేర్చుకొని వాటిని అవగాహన చేసుకోవాలని ఉపాధ్యాయులు పి.రమేష్ కోరారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం సందర్శించారు. గ్రంథాలయ అధికారి బి.రూపావతి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఉపాధ్యాయులు భాస్కరరావు గణితంపై అవగాహన కల్పించారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చిన్న కాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002 – 2003 పూర్వ విద్యార్థులు తమతో చదువుకున్న తోటి విద్యార్థికి ఆర్థికసాయం అందించారు. తెలికిపెంట గ్రామానికి చెందిన నడిమింటి ఉగాది అనే వ్యక్తి ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుండేవాడు. ఇటీవల ఉగాదికి పక్షవాతం వ్యాధి వచ్చి కాలు, చేయి చచ్చు పడిపోయాయి. దీంతో జీవనోపాధి లేక మంచాన పడ్డ ఉగాది కుటుంబానికి తోటి పూర్వ విద్యార్థులు రే.40 వేలు ఆర్థికసాయాన్ని సోమవారం అందించారు. ఆపదలో ఉన్న తోటి విద్యార్థిని పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయంతో ఆదుకోవడంపై పలువురు అభినందనలు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న ఎడిఎ రాజ్‌గోపాల్

నవధాన్యాల సాగుపై అవగాహన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కర్లమ్మలో సోమవారం డిపిఎం పూజారి సత్యనారాయణ ఆదేశాలు మేరకు ఎడిఎ రాజ్‌గోపాల్ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ మేరకు రైతులందరితో వీధుల్లో ర్యాలీ చేశారు. అనంతరం నలుగురు ఆదర్శ రైతులకు ప్రకృతి వ్యవసాయంలో ప్రగతి సాధించిన పనితీరును గుర్తిస్తూ చిరు సన్మానాలు చేశారు. అలాగే నవధాన్యాలు సాగు వల్ల కలిగే ఉపయోగాలు రైతులకు చెప్పారు. వరి పంట ఎదలో ఎలా వేసుకోవాలి, వరి దమ్ములో ఎలా వేసుకోవాలో రైతులకువివరించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ మణి, ఎంటి సూర్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జి చిన్నమ్మి, ఐసిఆర్‌పిలు రమణమ్మ, మాధవి, కోటేశ్వరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కళల వేదిక వాణి కళాక్షేత్రం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కళలకు వేదికగా శ్రీ వాణి కళాక్షేత్రం నిలుస్తుందదని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సోమవారం తాళ్లపాక అన్నమాచార్యుల 617వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ తాళపాక అన్నమాచార్యులు తన సాహిత్యంతో తిరుపతి వెంకటేశ్వర స్వామినే మెప్పించారన్నారు. అటువంటి మహనీయుని జయంతిని జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వాణి కళాక్షేత్రం వ్యవస్థాపకులు దుంపల ఈశ్వరరావును ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం కళాకారులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో శ్రీవాణి కళాక్షేత్రం నిర్వాహకులతో పాటు జిఎస్‌టి అధికారి గొలివి రాణిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రశంసాపత్రం

ప్రజాశక్తి- పొందూరు

ఎస్‌సి వసతిగృహాల్లో చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థినులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రశంసాపత్రంతో పాటు నగదు రివార్డును అందించింది. పొందూరు పోస్టుమెట్రిక్ ఎస్‌సి బాలికల వసతిగృహంలో చదివిన విద్యార్థిని గండి భవాని ప్రశంసాపత్రం, నగదు రివార్డును ఇటీవల విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు డోలా వీరాంజ నేయులు, గుమ్మడి సంధ్యారాణి చేతులమీదుగా అందుకుంది. ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రభుత్వ కళాశాలలో చదివి 924 మార్కులు సాధించింది. విద్యార్థిని ప్రతిభను ఎమ్మెల్యే రవికుమార్, వసతిగృహ సంక్షేమాధికారిణి శ్రీదేవి తదితరులు అభినందించారు.

ప్రశంసాపత్రంతో భవాని

గ్రంథాలయంలోకి వర్షపు నీరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని బొడ్డేపల్లిపేట వద్ద నున్న శాఖా గ్రంథాలయంలోకి వర్షపునీరు చేరడంతో గ్రంథాలయానికి వచ్చిన పాఠకులు ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులు, కురిసిన వర్షానికి గ్రంథాలయంలోకి వర్షపునీరు చేరింది. గ్రంథాలయంలో అప్పటికే ఉన్న పాఠకులు వర్షం పడినంత సేపు ఒక వైపున నిల్చుని ఉండి పోయారు. వర్షం ఆగిపోవడంతో పాఠకులు అక్కడి నుంచి వెంటనే వెనుదిరిగారు. గ్రంథాలయ సహాయకులు జయలక్ష్మి వర్షం ఆగిన వెంటనే గ్రంథాలయం లోపలికి చేరిన నీటిని బయటకు తోడి వేయడంతో అక్కడి నుంచి గ్రంథాలయ సిబ్బంది అందరూ వెనుతిరిగారు

గ్రంథాలయంలోకి చేరిన నీటిని తోడుతున్న జయలక్ష్మి